మినీకథ

# అపార్థం



యస్. బలరామకృష్ణ

"ఏమండీ! ఇది తెలుసా? మీ చెల్లెలు, బావ గారు మొన్న మన వూరు వచ్చారట... మీ తమ్ముడిగారింటికి వచ్చి వెళ్ళిపోయారట... ఊళ్ళోనే ఉన్న మనింటికి రాకుండా వెళ్ళి పోయారు చూశారా! ఏవో మనస్పర్థలున్నంత మాత్రాన ఇంటికి రావడం మానెయ్యాలా?" భర్తతో కంప్లయింట్ చేసింది భారతి.

"ఎప్పుడు వచ్చారట? ఎందుకు వచ్చారు? తమ్ముడింటికి వచ్చి వెళ్ళిపోయారా?" ఆశ్చర్య పోతూ అడిగాడు రామారావు.

'తమ మధ్య ఇంటికి రావడం మానేయవలసి నంత గొడవలేమీ లేవు! ఏవో స్వల్ప మనస్పర్థలు తప్ప! ఎందుకిలా చేసింది?' ఆలోచిస్తున్నాడు.

"నేను చెప్తూనే ఉన్నాను! మీ అమ్మగారు పోయినప్పటినుండి వాళ్ళు మారిపోయారు. మీ అమ్మగారి తాలూకు బంగారం వాటా అడిగా మని-అప్పటినుండి మనమంటే కిట్టడంలేదు. మీరేమో పాతకాలం మనుషుల్లాగా చెల్లెలు... చెల్లెలు అని కలవరిస్తారు. ఇప్పుడు చూడండి! ఏం చేసిందో!" పార్వతమ్మగారు చెప్పింది. లేకపోతే నాకూ తెలీదు. 'మీ ఆడబిడ్డను మీ మరిది ఇంటిదగ్గర చూశాను. మీ ఇంటికి వచ్చినట్టు లేదేమిటి?" అని ఆమె వెటకారంగా అంటుంటే నా మనస్సు చచ్చిపోయింది.'ఏమైనా గొడవపడ్డారా?' అన్నప్పుడు మనస్సు రగిలి పోయింది.నాకంతా అవమానంగా తోచింది..." భారతి తన ధోరణిలో మాట్లాడుకుపోతోంది.

ఏమిటే చెల్లెలు మారిపోయిందా?... అవును మారిపోదేమిటా!' పెళ్ళయింది...మొగుడు... పిల్లలు... వాళ్ళకోసం తాపత్రయం...అందుకే కదా అమ్మ బంగారంలో వాటా తీసుకున్నానని కష్టం పెట్టుకొన్నది. అందుకే రాలేదేమో, అయినా డబ్బు ముందు అన్ని బాంధవ్యాలు బలాదూర్! తను భారతి మాటల్ని పెడచెవిని పెట్టి ఇంతకాలం తన చెల్లెల్ని వెనుకేసు కొచ్చాడు.

ఇప్పుడు భారతే గెలిచింది!

తన చెల్లెలు తమ్ముడింటికి వచ్చి తనింటికి రాలేదా?... ఇక తనూ వెళ్ళడు. 'వాళ్ళకేనా అంత పట్టుదల, తనకు లేదా... పట్టుదల ఆత్మాభిమానం! తనను అన్నయ్యగా చూడలేన పుడు తను మాత్రం చెల్లెలుగా ఎలా ప్రేమించ గలడు' ఉద్రేకంగా, కోపంగా, దృఢంగా అను కున్నాడు రామారావు.

"పోస్ట్" కేక విని వీధిలోకి పరుగెత్తాడు ఆలోచనలకు స్వస్తిచెప్పి.

కవరు అందుకుని చూశాడు. చెల్లి దగ్గర నుండి. 'సంగనాచిలాగ ఇక్కడకు వచ్చినట్టు తనకు తెలీదనుకొని ఏదో రాసుంటుంది' కోపంగా కవరు చించాడు.

"అన్నయ్యకు నమస్కరించి నీ చెల్లెలు పద్మ వ్రాయునది. ఇక్కడ మేము క్షేమం. అచ్చట అంతా క్షేమమని తలుస్తాను. నేను మొన్న పదిహేనో తారీఖున పిల్లలతోబాటు మీ వూరు వచ్చి వెళ్ళాను. ముందు మీ యింటి దగ్గర దిగాను. తాళం వేసి ఉంది. పక్కవాళ్ళను అడిగితే తిరపతి వెళ్ళారన్నారు. తమ్ముడింటికి వెళ్ళాను. రెండురోజులున్నాను. మీరు వస్తారని వచ్చేటప్పుడు కూడా చూశాను. మీరప్పటికి రాలేదు. దసరా శెలవల్లో పిల్లలతో కలసి మా వూరు రండి! వదినకు నా నమస్కారములు అందజేస్తావని ఆశిస్తాను.

ఇంతేసంగతులు

నమస్కారములతో నీ చెల్లెలు

పద్మ

లెటరు పూర్తిచేసి 'ఎంత తొందరపడ్డాను? అన్యాయంగా అపార్థం చేసుకున్నాను!' పశ్చాత్తాప పడ్డాడు. అవును తాము పదిహేనున వెళ్ళి ఇరవైన ఇల్లు చేరారు. వంటింట్లో తనను, తన చెల్లెల్ని తిట్టిపోస్తున్న భారతి దగ్గరకు పరుగెత్తాడు ఈ విషయం చెప్పడానికి రామారావు.